జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శనివారం | 8-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 748 పేజీలు: 4 వెల : రూ.7


* నిర్మాణం ఆయనదే .. తనిఖీ చేసేది ఆయనే! * వాహన బిల్లులే 12లక్షలట.. * సీఐడీ సీజ్ చేసిన సామాగ్రి మాయం.. డీఎస్పీ విచారణ * కట్ట తెగినా కదలని 'విజయవాడ' ఎస్ఈ * ఆమదాలవలస కేంద్రంగా సాగుతున్న అక్రమాల పర్వం * సాగునీటి శాఖలో చర్చనీయాంశం

## వంశధార నిధుల మళ్లింపులో...

# మాయాజాలం!




శ్రీకాకుళం, ఆగస్టు 7 (వార్త): జిల్లాలోని వంశధార ప్రాజెక్ట్ పరిధిలో నిబంధనల ఉల్లంఘనలు, నిధుల దుర్వినియోగం పరాకాష్టకు చేరాయి. ఒకే అధికారికి కీలకమైన రెండు విభాగాల బాధ్యతలు అప్పగించడంతో "చెరువు తవ్వకం ఆయనే.. నాణ్యత సర్టిఫికెట్ ఇచ్చేది ఆయనే" అన్న చందంగా తయారైంది వ్యవహారం. గతంలో ఆమదాలవలస ఇన్వెస్టిగేషన్ డివిజన్ ఈఈగా పనిచేసిన గరుగుబిల్లి రామచంద్రరావు, వంశధార ఎస్ఈగా అదనపు బాధ్యతలు పొందారు. ఆ తర్వాత ఆయన క్వాలిటీ కంట్రోల్ ఈఈగా బదిలీ అయినప్పటికీ, నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను సైతం తన వద్దే ఉంచుకోవడం సాగునీటి శాఖలో చర్చనీయాంశంగా మారింది. నాణ్యతను తనిఖీ చేయాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారే స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ, వాటికి నాణ్యత ధృవీకరణ పత్రాలు ఇచ్చుకునే విరుద్ధమైన పరిస్థితి ఇక్కడ నెలకొంది. నిబంధనల ప్రకారం ఆయన బదిలీ కాగానే రద్దు కావాల్సిన డిప్యూటీ సూపర్ ఇంజనీర్ పోస్టును రద్దు చేయకుండా, అదనపు బాధ్యతల అండతో చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### సొంత బండికి రూ. 12 లక్షల 'గ్రాంట్'!

రామచంద్రరావు ఇన్వెస్టిగేషన్ ఈఈగా ఉన్న సమయంలో ఒక ప్రైవేట్ వ్యక్తి పేరుతో ఉన్న బొలెరో వాహనాన్ని నెలకు రూ. 35,000 చొప్పున అద్దె ప్రాతిపదికన శాఖలో కేటాయించుకున్నారు. అయితే అది వాస్తవానికి ఆయన సొంత వాహనమేనని సమాచారం. బడ్జెట్ గ్రాంట్లు లేకపోవడంతో ఆయనతో పాటు కింది స్థాయి డీఈల వాహన బిల్లులు దీర్ఘకాలంగా నిలిచిపోయాయి. కాగా, ఈయన వంశధార సర్కిల్ ఎస్ఈ హోదాలోకి రాగానే తన అధికార బలంతో శ్రీకాకుళం సర్కిల్ ఆఫీస్ నుండి ఆమదాలవలస డివిజన్‌కు రూ. 12 లక్షల నిధులను మళ్లించారు. నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన బకాయి ఉన్న డీఈల బిల్లులను ముందుగా చెల్లించాల్సి ఉండగా, కింది సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి మిగతా వారి బిల్లులను పక్కన పెట్టి తన సొంత వాహనానికి సంబంధించిన రూ.12 లక్షల పూర్తి బకాయిలను డ్రా చేసుకోవడం శాఖా పరంగా కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఎస్ఈ హోదాలో ఈయన శ్రీకాకుళంలో వేరే ఇన్నోవా వాహనాన్ని వాడుతున్నారు.

### సామాగ్రి మాయం.. డీఎస్పీ విచారణ!

ఆమదాలవలసలో గతంలో మెడికల్ బోర్డుకు కేటాయించిన స్థలంలో ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణం కోసం పాత గోదామును తొలగించారు. ఆ గోదాములో గతంలో ఒక వివాదానికి సంబంధించి సీఐడీ అధికారులు సీజ్ చేసి ఉంచిన విలువైన ఇనుప షట్టర్లు, ఇతర మెటీరియల్ భద్రపరిచారు. రామచంద్రరావు ఈఈగా ఉన్న సమయంలోనే ఈ గోదామును తొలగించినప్పటికీ, ఆ సీఐడీ ప్రాపర్టీని బాధ్యతాయుతంగా ఎవరికీ హ్యాండోవర్ చేయకుండా బయట పారేశారు. తదనంతరం బాధ్యతలు చేపట్టిన నూతన ఈఈ బి.వి. రమణ ఆ మెటీరియల్‌ను గుర్తించి, ఒక గదిలో భద్రపరిచి సీఐడీ అధికారులకు అధికారికంగా సమాచారం అందించారు. పంచనామా నిర్వహించకుండా ఈ విలువైన మెటీరియల్‌ను ఎందుకు నిర్లక్ష్యంగా తరలించారనే అంశంపై సీఐడీ డీఎస్పీ కాళిదాసు ఆధ్వర్యంలో ప్రస్తుతం తీవ్ర విచారణ నడుస్తోంది.

### కట్ట తెగినా కదలని వైనం..

జలుమూరు మండలం పరిధిలో శ్రీముఖలింగం దాటిన తర్వాత పలాస వైపు వెళ్లే లెఫ్ట్ మెయిన్ కెనాల్‌కు ఇటీవల పెద్ద బ్రీచ్ పడి గట్టు కోసుకుపోయింది. గతంలో ఈ కెనాల్ పనుల కోసం కలెక్టర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినప్పటికీ, పనుల్లో తీవ్ర నాణ్యత లోపం వల్లే ఇప్పుడు కట్ట తెగిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా పర్యవేక్షించాల్సిన ఎస్ఈ మాత్రం విజయవాడలోనే ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు తప్ప క్షేత్రస్థాయికి రాలేదు. క్షేత్రస్థాయి పరిశీలనలు చేయకుండా కేవలం లాగ్ బుక్కులు రాసుకుంటూ, కార్ బిల్లులు డ్రా చేసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఆమదాలవలసలోనే 'క్యాంప్' రాజకీయం నిబంధనల ప్రకారం నేరడి సబ్‌డివిజన్ నేరడిలో, కొత్తూరు సబ్‌డివిజన్ కొత్తూరులో, హిరమండలం సబ్‌డివిజన్ హిరమండలంలో పనిచేయాల్సి ఉంది. కానీ ఈ నాలుగు సబ్‌డివిజన్ల అధికారులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్స్ వదిలి నిబంధనలకు విరుద్ధంగా ఆమదాలవలసలోనే క్యాంప్ ఆఫీస్ పేరిట తిష్ట వేశారు. దీనివల్ల నేరడి, కొత్తూరు వంటి ప్రధాన ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తిగా పడకేశాయి. మరోవైపు, తప్పు డీఈ, ఈఈలది కూడా ఉన్నప్పటికీ, ఎలాంటి అనుభవం లేని ఒక ఏఈని మాత్రమే ఈఎంసీకి సరెండర్ చేసి మిగతా వారిని రక్షించే ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇవే కాకుండా ఆఫీస్ కంటింజెంట్ గ్రాంట్స్‌లో భారీగా అవకతవకలు జరిగాయని, వైజాగ్, మదనాపురంలో ఇళ్లతో పాటు రాజమండ్రి పరిసరాల్లో 20 ఎకరాల ల్యాండ్, బంగ్లా కొనుగోలు చేసినట్లు ఆస్తుల కూడబెట్టడంపై శాఖాంతర్గతంగా పెద్ద ఎత్తున గుసగుసలు వినిపిస్తున్నాయి.

# పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

* అప్రమత్తమైన లోకో పైలట్
* తప్పిన భారీ రైలు ప్రమాదం
* రైల్వే అధికారుల హుటాహుటిన సంఘటన ప్రదేశానికి
* తక్షణ చర్యలు చేపట్టిన అధికారులు
* పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

టెక్కలి మందస, ఆగస్టు 7(వార్త):ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్స్ రైలు శుక్రవారం సాయంత్రం మందస రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. లోకో పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఈ ఘటనతో రైల్వే శాఖ అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేసింది. సమాచారం అందుకున్న వెంటనే పలాస నుంచి రైల్వే ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, ట్రాక్ మెయింటెనెన్స్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పట్టాలు తప్పిన బోగీలను తిరిగి గాడిలోకి తీసుకురావడంతో పాటు దెబ్బతిన్న ట్రాక్‌ను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేసే పనులు చేపట్టారు. భారీ యంత్రాలు, ప్రత్యేక సాంకేతిక సిబ్బందితో మరమ్మత్తులు కొనసాగించారు. ఈ ఘటన కారణంగా ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను వివిధ స్టేషన్లలో నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరికొన్ని రైళ్లను నెమ్మదిగా నడపడంతో అవి నిర్ణీత సమయానికి ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకున్నాయి.ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించకపోవడం ఊరటనిచ్చింది. లోకో పైలట్ సమయస్ఫూర్తి, రైల్వే సిబ్బంది వేగవంతమైన చర్యల వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. పట్టాలు తప్పడానికి గల కారణాలపై విచారణ ప్రారంభించామని, ట్రాక్ పూర్తిగా సురక్షితంగా ఉందని నిర్ధారించిన అనంతరం రైళ్ల రాకపోకలను సాధారణ స్థితికి తీసుకువస్తామని రైల్వే అధికారులు వెల్లడించారు.




# సీదిరి బెయిల్ పిటిషన్.. డిస్మిస్

* మరో రెండు వారాలు రిమాండ్ పొడిగింపు



పలాస, ఆగస్టు 7 (వార్త): మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు బెయిల్ మంజూరు కాలేదు. ఆయన తరఫు న్యాయవాది దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీంతో మరో రెండు వారాల పాటు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాద ఘటనలో సాక్ష్యాధారాల తొలగింపునకు పాల్పడ్డారనే ఆరోపణలతో జూలై 22న మాజీ మంత్రి అప్పలరాజును పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో సోంపేట కోర్టులో అప్పలరాజు తరఫు న్యాయవాది వడిశా బాలకృష్ణ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ, మరో రెండు వారాల రిమాండ్‌ను పొడిగించినట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సబ్సిడీపై నాణ్యమైన బియ్యం

- రైతు బజార్లు, మిల్లుల అవుట్‌లెట్లలో విక్రయాలు ప్రారంభం
- కిలోకు రూ.10 వరకు తక్కువ ధర
- పేద, మధ్యతరగతి వారికి ఊరట
- ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, ఆగస్టు 7 (వార్త):** ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రైతు బజార్లు, రైస్ మిల్లుల అవుట్‌లెట్ స్టోర్లలో సబ్సిడీ ధరలకు బియ్యం విక్రయాలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ ధరతో పోలిస్తే కిలోకు రూ.10 వరకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలుగుతుందన్నారు. 'మాటల్లో కాదు.. చేతల్లో సంక్షేమం' అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి అవసరమైన మేరకు బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విక్రయాల సమయంలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందుతున్నదీ లేదీ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేష్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్, కార్యదర్శి శాసనపురి మురళి, సిందిరి కిషోర్, కె.వి.గోపాల్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీపీని పరామర్శించిన శ్రీకాంత్



**పలాస, ఆగస్టు 7 (వార్త):** మాజీ ఎంపీపీ, తన మిత్రుడు వసంతస్వామి ఆరోగ్య పరిస్థితిని పలాస మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ వసంతస్వామిని కలిసి క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం మర్లపాడు గ్రామానికి చెందిన దట్టి శాంతారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దట్టి శాంతారావు కుటుంబ సభ్యులతో దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి అవసరమైన సమయంలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

### తమ భూముల్లో విద్యుత్ స్తంభాలు వేయడంపై

# దళితుల ఆవేదన


- ఖాళీ స్థలాలు ఉన్నా తమ భూముల్లోనే స్తంభాలు ఏర్పాటు చేశారంటూ ఆరోపణ
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోయిన బాధితులు



**జలుమూరు, ఆగస్టు 7(వార్త):** గొటివాడ పంచాయతీ పరిధిలోని మహమ్మద్‌పురం గ్రామానికి చెందిన దళితులు విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు చెందిన భూముల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం సరికాదంటూ వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకుల ప్రోత్సాహంతోనే తమ భూముల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు గ్రామంలో ఖాళీ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కావాలనే తమ భూముల్లో స్తంభాలను ఏర్పాటు చేశారని వారు వాపోయారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదని బాధితులు తెలిపారు. తమ భూముల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో భూమి వినియోగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో పరిస్థితిని పరిశీలించి, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించిన అనంతరం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. తమకు న్యాయం జరిగేలా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మహమ్మద్‌పురం దళితులు విజ్ఞప్తి చేశారు.

## డీఎస్సీ నియామకాలపై వైసీపీ రిలే నిరాహార దీక్ష

- రెండో రోజుకు చేరుకున్న ఆందోళన
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**సారవకోట, ఆగస్టు 7(వార్త):** డీఎస్సీ నియామకాల వ్యవహారంపై సారవకోటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. మండల పార్టీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ దీక్షకు మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టి, అవకతవకలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియామకాల ప్రక్రియపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీ నియామకాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడేలా చర్యలు చేపట్టాలని నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళనను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.



### అండర్-17 ఖోఖో..

# రాష్ట్ర స్థాయి పోటీలకు సుస్మిత

- అమరావతి చాంపియన్‌షిప్ ఎంపికల్లో ప్రతిభ
- జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి జడ్పీహెచ్ఎస్ చిన్నబాడం విద్యార్థిని
- అభినందించిన హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

**పలాస, ఆగస్టు 7 (వార్త):** ఈ నెల 6న శ్రీకాకుళంలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ సెలక్షన్స్‌లో జడ్పీహెచ్ఎస్ చిన్నబాడం విద్యార్థిని వంకల సుస్మిత అండర్-17 కోకో విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ ఉషారాణి తెలిపారు. సుస్మితకు వ్యాయామ ఉపాధ్యాయురాలు టీ. గీత ప్రత్యేక శిక్షణ అందించడంతో ఈ విజయాన్ని సాధించిందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సుస్మితను పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై పాఠశాల వాతావరణంలో ఆనందం వ్యక్తమైంది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.


### వైఎస్సార్‌సీపీ శ్రేణులు ..

# ఐక్యతతో ముందుకెళ్లాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సమష్టిగా పనిచేయాలి
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లాలి
- పలాసలో వైఎస్సార్‌సీపీ సమావేశంలో నేతల పిలుపు

**పలాస, ఆగస్టు 7 (వార్త):** ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎలాంటి నిరుత్సాహానికి గురికాకుండా ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పలాసలో నిర్వహించిన పార్టీ సమావేశంలోమాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ కక్షసాధింపు చర్యలు పెరుగుతున్నాయని, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. జగన్ పర్యటనతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగి ఇటీవల మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంగా పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారని ఆయన గుర్తుచేశారు. ప్రజలు, కార్యకర్తలు చూపిన ఆదరణ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. పలాస నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం, యువజన విభాగం, అనుబంధ సంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలపై పార్టీ తరఫున పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ఎన్ని ధనంజయరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పైల వెంకటరమణ (చిట్టి), పలాస పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బమ్మిడి సంతోష్‌కుమార్, మహిళా విభాగం నాయకులు సుజాత పండ, బోర చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

- తల్లిపాల ప్రాధాన్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన



**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** నరసన్నపేట మఠం వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా శిశువులకు తల్లిపాలు అందించడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. శిశువుల ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని, తల్లులు తగిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ యమున మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారాన్ని తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

## కరువుపై 10న ఆర్డీఓకు వినతి

**మందస, ఆగస్టు 7(వార్త):** వర్షాలు లేకపోవడంతో ఈ ప్రాంతంలో కరువు ఛాయలు అలముకున్నాయని, దీనిపై పలాస ఆర్డీఓకు ఈ నెల 10న వినతపత్రం అందజేయనున్నట్లు వంశధార సాగుజల సాధన కమిటీ నాయకులు కోరారు. మన ప్రాంతంలో ఇప్పటి వరకు వానలు లేక పంటనారులు, వెదలు మాడిపోయాయన్నారు. ఈ నెల 10న ఉదయం 10గంటలకు పలాస ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని, మన ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ మెమోరాండము అందించాలన్నారు. రైతులందరూ మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంధాలయం వద్దకు ఈ నెల 10న ఉదయం 9గంటలకు చేరుకోవాలని వారు కోరారు.

## గుర్రపు డెక్కతో గొట్టిపల్లి చెరువుకు దుస్థితి

- 200 ఎకరాలకు అందని సాగునీరు- నిరుపయోగంగా చెరువు
- గుర్రపుడెక్క తొలగించి పునరుద్ధరించాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** గొట్టిపల్లి గ్రామంలోని చెరువు గుర్రపుడెక్కతో పూర్తిగా కప్పుకుపోయి నిరుపయోగంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు నీటితో కళకళలాడుతూ సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందించిన ఈ చెరువు ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరుకోవడంతో రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోవడంతో నీటి ప్రవాహం, నిల్వ సామర్థ్యం దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. చెరువు మొత్తం గుర్రపుడెక్కతో కప్పుకుపోవడంతో నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ చెరువు ద్వారా సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందేదని, ప్రస్తుతం చెరువు పరిస్థితి కారణంగా దాని ప్రయోజనం రైతులకు అందడం లేదని గ్రామస్థులు తెలిపారు. చెరువు పునరుద్ధరణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించి, పూడికను పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. చెరువును తిరిగి వినియోగంలోకి తీసుకువస్తే సాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారమై రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొట్టిపల్లి చెరువును పరిశీలించి, గుర్రపుడెక్క తొలగింపుతో పాటు చెరువు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలి

**- 15లోగా ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో చేరాలి**

**- కోమర్తిలో ఆత్మ సౌజన్యంతో ఆర్‌పీఎల్ శిక్షణ కార్యక్రమం**




**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** ప్రతి రైతు ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎల్.వి. మధు సూచించారు. కోమర్తి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన ఆర్‌పీఎల్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటల బీమా ప్రాధాన్యతను రైతులకు వివరించారు. పంటల బీమా పథకంలో నమోదు చేసుకునేందుకు ఆగస్టు 15 చివరి తేదీ అని తెలిపారు. రుణం పొందిన రైతులు సంబంధిత బ్యాంకును సంప్రదించి తమ పంటల బీమా ప్రీమియం నమోదు అయిందో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని సూచించారు. రుణం లేని రైతులు సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాలను సంప్రదించి ఎకరా వరికి రూ.160 చెల్లించి పంటల బీమాలో నమోదు చేసుకోవాలని సూచించారు. నైరా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీలత మాట్లాడుతూ నేలలో కార్బన్ శాతాన్ని పెంచడంతో పాటు జీవన ఎరువుల వినియోగానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా పంటల దిగుబడిని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి. గురుమూర్తి మాట్లాడుతూ పొటాష్ ఎరువుల వినియోగం వల్ల మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. రైతులు పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు.

రాగోలు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి. ఉదయబాబు మాట్లాడుతూ బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు 19:19:19 లేదా 13:0:45 ఎరువును ఎకరాకు ఒక కిలో చొప్పున పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై. సురేష్ రైతులతో ప్రశ్నోత్తర కార్యక్రమాన్ని నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. మండల వ్యవసాయ అధికారి వై. సూర్యకుమారి మాట్లాడుతూ డీఏపీకి ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న ఇతర ఎరువులను కూడా రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఈఓలు పి. శిరీష, జి. ప్రసాద్, వీఏఏ బి. రామకృష్ణ, నైరా వ్యవసాయ కళాశాలకు చెందిన పీజీ విద్యార్థులు, గ్రామ ప్రగతిశీల రైతులు జగన్నాథం, అప్పలనాయుడు, ఉంగటి రాజేశ్వరరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆఫ్‌షోర్ నిర్వాసిత కాలనీలో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు

**- త్వరలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రం -ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, ఆగస్టు 7 (వార్త):** పలాస మండలంలోని ఆఫ్షోర్ నిర్వాసిత కాలనీలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసిత కాలనీ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, డ్రైనేజీ, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. గత పాలనలో నిర్లక్ష్యంకు గురైందని, గత ప్రభుత్వం నిర్వాసిత కాలనీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని గౌతు శిరీష విమర్శించారు. కనీసం మట్టి రహదారులు కూడా ఏర్పాటు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఆఫ్షోర్ నిర్వాసితుల సంక్షేమం, కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయం చైర్మన్ పీరుకట్ల విఠల్, పలాస ఎంపీడీవో వసంత్ కుమార్, అధికారులు, టిడిపి నాయకులు, ఆఫ్షోర్ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలి

**- రద్దీ బస్సుల్లో ప్రమాదకర ప్రయాణాలు..**

**- తల్లిదండ్రుల్లో ఆందోళన**

**- అక్టోబర్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ హామీ**

**- రాజశేఖర్ నాయుడు**



**జలుమూరు, ఆగస్టు 7 (వార్త):** జలుమూరు మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి నరసన్నపేటలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, 2024 శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి నాయుడు గారి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రతిరోజూ ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో, సాయంత్రం విద్యాసంస్థలు ముగిసే వేళ విద్యార్థులు బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. సాధారణ ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసి ఉండటంతో విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. బస్సుల్లో రద్దీ కారణంగా విద్యార్థులు ఫుట్‌బోర్డులపై, డోర్ల వద్ద నిలబడి ప్రయాణించాల్సి వస్తోందని, ఒక్కోసారి బస్సుల పైభాగంలో కూడా విద్యార్థులు ప్రయాణించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతకు ఇది తీవ్ర ముప్పుగా మారుతోందని అన్నారు. తమ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం విద్యాసంస్థల ప్రారంభ, ముగింపు సమయాలకు అనుగుణంగా ప్రత్యేక విద్యార్థి బస్సులను నడపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యపై శ్రీకాకుళం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ను కలిసి విద్యార్థుల ఇబ్బందులను వివరించినట్లు నాయుడు గారి రాజశేఖర్ తెలిపారు. స్పందించిన రీజినల్ మేనేజర్ సంబంధిత పీఆర్ఓను స్వయంగా పంపించి పరిస్థితిని పరిశీలించారని, అక్టోబర్ నెల నుంచి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయనున్నట్లు నివేదిక ఇచ్చారని ఆయన వెల్లడించారు. విద్యార్థుల రవాణా భద్రత విషయంలో అధికారులు మరింత చొరవ తీసుకుని ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని నాయుడు గారి రాజశేఖర్ కోరారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా రద్దీ బస్సుల్లో ప్రయాణించే పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

## పారిశుధ్యం, వీధిలైట్ల మెరుగుదలకు చర్యలు

**- నరసన్నపేట ఇన్‌చార్జి ఈవో జగన్‌మోహన్‌రావు**



**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగుకాలువల పరిశుభ్రత, వీధిలైట్ల నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఇన్‌చార్జి ఈవో జగన్‌మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు మురుగుకాలువలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా వీధిలైట్ల సమస్యలను గుర్తించి వాటి నిర్వహణ, మరమ్మతులపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పంచాయతీ సిబ్బందితో ఇప్పటికే వివిధ అంశాలపై చర్చిస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేస్తామని జగన్‌మోహన్‌రావు అన్నారు. పంచాయతీ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణలో స్థానిక ప్రజలు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అగ్నికుల క్షత్రియుల ఆరాధ్యుడు లక్ష్మణస్వామి



**సోంపేట, ఆగస్టు 7(వార్త):** అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి పితామహుడిగా,ఆరాధ్యుడిగా గుర్తింపు పొంది దశాబ్దాలుగా విశేష సేవలు అందించిన పొన్నమంద లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి కార్యక్రమం ఈ మండలం బారువ గ్రామంలో స్థానిక అగ్నికుల క్షత్రియులు ఘనంగా నిర్వహించారు. సంఘ భవనంలో శుక్రవారం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి రాష్ట్రంలో అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గ ప్రతిష్టను ఇనుమడింపజేసి సామాజిక వర్గ బలోపేతానికి విశేషంగా కృషిచేసిన మహానుభావుడని అన్నారు. లక్ష్మణ స్వామి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం గర్వకారణమని అన్నారు.

ఆయుర్వేద వైద్యంలోనూ విశేష సేవలు అందించడమే కాకుండా అనేక రకాల ఆయుర్వేద మందులను తయారుచేసి విదేశాలకు పంపించిన ఘనత లక్ష్మణ వర్మకే దక్కిందని పేర్కొన్నారు. అటువంటి మహానీయుడు అందరికీ ఆదర్శమని కొనియాడారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**సోంపేట, ఆగస్టు 7(వార్త):** సోంపేట మండలంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సిడిపిఓ కే.వసుంధర దేవి ఆధ్వర్యంలో లక్ష్మీపురం, సిహెచ్ సోంపేట, బారువపేట గ్రామాల్లో ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సిడిపిఓ తో పాటు సూపర్వైజర్లు హాజరై తల్లిపాల ఆవశ్యకతను గూర్చి వివరించారు. తల్లిపాలు బిడ్డలకు అమృతం వంటివని పేర్కొన్నారు. రోగనిరోధక శక్తి పెంపొందించడంలోనూ, వ్యాధులను నివారించడంలోనూ తల్లిపాల విశిష్టత ఎనలేనిదని అన్నారు. ప్రతి ఒక్కరూ బిడ్డల విషయంలో తల్లిపాల ను నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. పలుచోట్ల గర్భిణీ స్త్రీలకు ఘనంగా సీమంతం కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిని డాక్టర్ రోషిని కూడా హాజరయ్యారు. అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం.. ఒకరి మృతి

**- నరసన్నపేట ప్రధాన రహదారికలో**

**గురువారం రాత్రి సంభవించిన ఘోర ప్రమాదం**



**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** నరసన్నపేటలోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. గురువారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో అన్న క్యాంటీన్ ఎదురుగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హడ్కో కాలనీకి చెందిన గుడ్ల శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడిన శ్రీనివాసరావును నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే రమణమూర్తి

**- నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు**



**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి (సింహాద్రి అప్పన్న) వారిని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి శుక్రవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానానికి చేరుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం కప్పస్తంభం వద్ద వేద పండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ నరసన్నపేట నియోజకవర్గ ప్రజలందరిపై సింహాద్రి అప్పన్న స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## యువతకు ఉచిత సైనిక శిక్షణ

**- గొట్టిపల్లిలో మాజీ సైనికుల సేవలు..**

**- ఇప్పటికే 150 మందికి ఉద్యోగాలు**

**నరసన్నపేట, ఆగస్టు 7(వార్త):** దేశ సరిహద్దుల్లో సేవలందించిన మాజీ సైనికులు ప్రస్తుతం యువతకు తమ అనుభవాన్ని అందిస్తూ వారికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. నరసన్నపేట మండలం గొట్టిపల్లి ప్రాంతంలో మాజీ సైనికులు ఖగేశ్వరరావు, సురేశ్‌కుమార్ విద్యార్థులు, యువతకు ఉచితంగా సైనిక శిక్షణ అందిస్తున్నారు. సైనిక ఉద్యోగాల్లో చేరాలనే ఆసక్తి ఉన్న యువతకు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. సైనిక శిక్షణతో పాటు సంప్రదాయ క్రీడల్లోనూ యువతకు శిక్షణ అందిస్తూ వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. దేశ సరిహద్దుల్లో పనిచేసిన తమ అనుభవాన్ని గ్రామీణ ప్రాంత యువతకు అందించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు మాజీ సైనికులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిక్షణ పొందలేని విద్యార్థులు, యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తూ వారిని ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నారు. తమ వద్ద శిక్షణ పొందిన యువతలో ఇప్పటికే సుమారు 150 మంది వివిధ ఉద్యోగాలు సాధించినట్లు ఖగేశ్వరరావు, సురేశ్‌కుమార్ తెలిపారు. యువతలోని ప్రతిభను గుర్తించి సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తే మంచి అవకాశాలను అందిపుచ్చుకోగలరని వారు పేర్కొన్నారు. మాజీ సైనికుల సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. తమ అనుభవాన్ని యువతకు పంచుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా బాటలు వేస్తూ ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ప్రశంసిస్తున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**-గిరిజన గూడేల్లో అభివృద్ధి వెలుగులు**

**-గిరిజన గూడేలకు రహదారి వారధి**

**-రూ.1.20కోట్లతో నిర్మించిన వంతెనలు ప్రారంభం**

**-అంగన్ వాడీలకు అధునాతన హంగులు.. గిరిజన బిడ్డలకు భరోసా**

**-రూ.24లక్షలతో సవరరాజపురం, దాలసరిలో నూతన భవనాలు**

**-ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష**



**మందస, ఆగస్టు 7(వార్త):** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మందస మండలంలోని బిల్లభద్ర, చొకంబో గ్రామాల్లో రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారి వంతెనలను ఎమ్మెల్యే గౌతు శిరీష లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, గిరిజనులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

## గిరిపుత్రుల సౌకర్యమే లక్ష్యం

వంతెనల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ వంతెనలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. గిరిపుత్రుల సౌకర్యార్థమే ఈ వంతెనలను నిర్మించామని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉందని శిరీష పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా చేరేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

## హామీల అమలులో ముందడుగు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చి, వాటిని వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## విద్య.. వైద్యం.. వసతులపై ప్రత్యేక దృష్టి

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని గౌతు శిరీష స్పష్టం చేశారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. గిరిపుత్రుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తుందని చెప్పారు.ల మారుమూల ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, అందుకే అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రహదారులు, వంతెనలు అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులు, రైతులు, వృద్ధులు, మహిళలు, అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన వారు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

## అభివృద్ధి పనులతో మారనున్న గిరిజన గ్రామాల రూపురేఖలు

బిల్లభద్ర, చొకంబో గ్రామాల్లో వంతెనలు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు ఇకపై తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించి, అవసరమైన చోట రహదారులు, వంతెనలు నిర్మించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే మౌలిక వసతులే అభివృద్ధికి బాటలు వేస్తాయని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని శిరీష పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్ రావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీను, మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డలకు సంపూర్ణ ఆహారం

**- సీడీపీఓ పెద్దింటి అరుణ**

**- ఘనంగా పలు అంగన్ వాడీ కేంద్రాల్లో తల్లి పాలవారోత్సవాలు**



**మందస, ఆగస్టు 7(వార్త):** తల్లిపాలు బిడ్డలకు సంపూర్ణ ఆహారమని, తొలి ముర్రపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు సీడీపీఓ పెద్దింటి అరుణ అన్నారు. మందస మండలంలోని కిల్లోయి సెక్టార్ లోని కుదుమాసాయి, హరిపురం సెక్టార్ లో బాలిగాం అంగన్ వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ప్రతీ సంవత్సరం ఆగస్టు 1నుండి 7వరకు నిర్వహించబడతాయని సీడీపీఓ అరుణ చెప్పారు. దీనిలో భాగంగానే మందస మండలంలో తల్లి పాలు వారోత్సవాలు సి.డి.పి.ఓ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పుట్టిన గంటలోపు తొలి ముర్రుపాలు పట్టించడం వల్ల శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు నీరు కూడా పట్టకుండా కేవలం తల్లిపాలే సంపూర్ణ ఆహారంగా ఇవ్వాలన్నారు. ఇది బిడ్డ మెదడు అభివృద్ధికి, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, హెల్త్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్.వి. రామలక్ష్మి, పి.జయలక్ష్మి, జె.లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కాగా, తల్లి పాలవారోత్సవాలు నేటితో ముగుస్తున్నట్టు సీడీపీఓ పి.అరుణ చెప్పారు.

## వైస్సార్సీపీ జిల్లా కమిటీలో ఇచ్ఛాపురానికి పెద్ద పీట





**ఇచ్ఛాపురం, ఆగస్టు 7(వార్త):** వైస్సార్సీపీ అనుబంధ విభాగల్లో ఇచ్ఛాపురానికి పెద్ద పీట వేశారు.జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల వింగ్ ఉపాధ్యక్షులు గా పిలక యాదవ రెడ్డి ని నియమించారు. జిల్లా కల్చరల్ వింగ్ కార్యదర్శి గా సాడి దుర్యోధన రెడ్డి ని నియమించారు.ఇంకా మరో పదిమందికి చోటు లభించింది. వీరిని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అభినందించారు.

## గిరిజన గ్రామాలను.. షెడ్యూల్డ్ ప్రాంతంగా గుర్తించాలి

**-జిల్లాలో 1/70 చట్టం అమలు చేయాలి**

**- ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల డిమాండ్**

**మందస, ఆగస్టు 7(వార్త):** జిల్లాలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా గుర్తించి, 1/70 చట్టం అమలు చేయాలని, జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని, జిల్లాలో ఐటిడిఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సవర గురునాథ్, సవర పాల్గొనరావు డిమాండ్ చేశారు. మందస లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1/70 చట్టాన్ని రద్దు చేయడానికి వ్యతిరేకంగా జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 8వ తేదీన జరుగు గిరిజన ప్రాంత బంద్ కు మద్దతుగా జిల్లాలోని అన్ని గిరిజన గ్రామాలలో నిరసన ప్రదర్శనలు, సభలు, సమావేశాలు జరపాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతంలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలను పూర్తిగా గిరిజనులకు ఇవ్వాలని, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియా లో చేర్చాలని జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సాగులో ఉన్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోవడంతో గిరిజనేతరులు ఆ భూములను ఆక్రమించుకుంటున్నారని వారన్నారు. తరతరాలుగా గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న వారికి ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జీవో నెంబర్ మూడు ప్రకారం గిరిజన ప్రాంతంలో అన్ని ఉద్యోగాలు భర్తీ చేశారని ఆ జీవోను సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు రద్దు చేసిందని దీని పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందని కానీ ఆ హామీని ఈ రెండేళ్ల కాలంలో అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ఉపాధ్యాయ ఉద్యోగాలలో కూడా గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని తక్షణమే గత ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబర్ మూడుకు చట్టబద్ధత కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు, గిరిజనులు అధిక శాతం ని వసిస్తున్న గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నప్పటికీ ఆ విధంగా చేయకపోవడం అనేక గ్రామాలు రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ ఏరియాలో చేరలేదని దీనివలన గిరిజనులకు జీవించే హక్కు కోల్పోతున్నారని అన్నారు. తక్షణమే నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలి ఇవ్వాలని వారు అన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంధు,నిరసన కార్యక్రమాలలో గిరిజనులు అధిక సంఖ్యలోపాల్గొని జయప్రదం చేయాలని వారు అన్నారు. కార్యక్రమంలో సవర.ఝూన్సీ, సవర త్రినాథ్, సవర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.




# నిస్వార్థ ప్రజా సేవకుడు ఎంపీటీసీ కంచి బెహరా

**- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**

**- ఘనంగాపుట్టిన రోజు వేడుకలు**





**మందస, ఆగస్టు 7(వార్త):** ప్రజాసేవ కంచిబెహరా అంకితమవుతున్నారని పలువురు నాయకులు అన్నారు. మేజరు పంచాయతీ మందస ఎంపీటీసీగా కంచిబెహరా చేస్తున్న సేవలను వారు కొనియాడారు. మందస ఎంపీటీసీ కంచిబెహరా జన్మదిన వేడుకలు మందసలో ఘనంగా జరిగాయి. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కంచిబెహరా తాను శ్రమిస్తూనే ఇతరులకు కూడా సాయపడుతున్నారని ప్రశంసించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకునిగా గుర్తింపు ఉన్న కంచిబెహరాకు ప్రముఖ సోషల్ వర్కర్ గిన్ని తిరుపతిరెడ్డి, కంచి బెహరాకు మంచి స్నేహితుడు, మూలిపాడు మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు, సొండిపూడి ఎంపీటీసీ ప్రతినిధి దడ్డ కిరణ్ కుమార్ తో పాటుపలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కంచిబెహరా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. నిత్యం సోషల్ మీడియాలో చురుకుగా కంచి పని చేస్తున్నారని అభినందించారు. కాగా, కంచి పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తాయి. అనంతరం కేక్ కట్ చేయగా.. 'హేపీ బర్త్ డే టు కంచి' అంటూ నాయకులు, స్నేహితులు బర్త్ డే విషెస్ తెలిపారు.

కార్యక్రమంలో మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావుతో పాటు తురక గణపతి, మద్ది మోహన్, సీతారాంబెహరా, అంపోలు సురేష్, క్రిష్ణాపండిట్, సంతోష్ ఆచారి, డొంబురుబెహరా, అలేఖ్ బెహరా, గౌరీశంకర్, అజయ్ కుమార్ బెహరా తదితరులు అభినందనలు తెలియజేసి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కంచిబెహరా మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**-వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు**

**-డీఎస్సీ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం**



**పలాస, ఆగస్టు 7 (వార్త):** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఐక్యంగా పోరాడాలని ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. డీఎస్సీ--2025 ఉపాధ్యాయ నియామకాల్లో అవకతవకలను నిరసిస్తూ పలాసలోని పార్టీ కార్యాలయం 'ప్రగతి భవన్' వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. దీక్షలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందని, యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు.

## అప్పలరాజు అరెస్టుపై ఖండన

ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. మాజీ మంత్రి, పలాస ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణకు డిమాండ్.

డీఎస్సీ--2025 నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. పరీక్షా కేంద్రాలు, మూల్యాంకనం, నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై సిట్ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు గ్రామస్థాయి నుంచి పనిచేయాలని సూచించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వారి పక్షాన నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, శ్రీదేవి, ఎన్ని ధనుంజయరావు, బమ్మిడి దుర్యోధనరావు, ఉంగ సాయికృష్ణ యాదవ్, పైల చిట్టిబాబు, సుజాత పండా, దొక్కరి దానయ్య యాదవ్, శిష్టు గోపి, బత్తిన హేమ ఈశ్వరరావు, అందాల శేషగిరావు, సేనాపతి కిషోర్, మడియ రామకృష్ణ, సొర్ర డిల్లేశ్వరరావు, బమ్మిడి సంతోష్, మజ్జి హేమరాజ్, చింతల సరస్వతి, దుర్గా శంకర్ పండా, దున్న సత్యం, అంబటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ మూడేళ్లైనా సమస్యలపై దృష్టి సారించండి అశోక్

**-నిరాహారదీక్ష శిబిరంలో శ్యాం**

**ఇచ్ఛాపురం, ఆగస్టు 7 (వార్త):** ఇచ్ఛాపురం పట్టణం లో డిఎస్సి అక్రమాలపై చేపట్టిన నిరసన నిరాహార దీక్షలో 2వ రోజు కార్యక్రమానికి నియోజకవర్గవైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షత వహించారు.కవిటి మండలం వైస్సార్సీపీ అధ్యక్షులు కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో ని కవిటి మండలం వైస్సార్సీపీ నాయకులు కార్యక్రమంలో నిరాహార దీక్షలు చేపట్టారు.



నిరాహార దీక్ష శిబిరాన్నుద్దేశించి సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ ప్రతినిధులే చట్టసభలకు ఎన్నికవుతూ వస్తున్నారని, వారి నేతృత్వంలోని ఇచ్ఛాపురం నియోజకవర్గం, విద్య వైద్యం, వ్యవసాయ, ఉపాధి రంగాలలో రాష్ట్రంలో అఖరున నిలబెట్టిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని విమర్శించారు. గత 12 ఏళ్ల క్రిందట ఎంఎల్ఏ గా భాద్యతలు తీసుకొని నిరాఘాటంగా 12 ఏళు ్ళ పూర్తి చేసుకున్న ఇచ్ఛాపురం ఎంఎల్ఏ బెందాళం అశోక్ ఏమీ చెయ్యలేని, చేతకాని, చేవలేని ప్రతినిధి గా మిగిలిపోయారని నిప్పులు చేరిగారు.

ఇంకా మరో మూడేళ్లు మాత్రమే పదవీ కాలం ఉందని, ఓట్లు వేసిన ప్రజల ఋణం తీర్చుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వంతో యుద్ధం చేస్తారో ,మెడలు వంచుతారో ఇచ్ఛాపురం నియోజకవర్గం లో కోల్పోయిన వ్యవసాయాన్ని తిరిగి పెంచాలని, సాగునీటి రంగంలో అవసరమైన ప్రాజెక్ట్ లు మంజూరు చేయించాలని కిడ్నీ, కాన్సర్ రోగాలతో కునారిల్లిపోతున్న ఉద్దానాన్ని వైద్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలని, వలసలు నిలుపుదల కు క్రియశీల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, మాజీ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి, మాజీ డీసీఎంస్ అధ్యక్షులు సల్ల దేవరాజు, నర్తు శివాజీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నూతలపాటి బాబురావు, మాజీ వైస్ చైర్ పర్సన్ లాభాల స్వర్ణమణి, ప్రత్తి అన్వేష్, సత్యనారాయణ పాడి,సుగ్గు ప్రేమ్ కుమార్, బుడ్డెపు త్రినాథ్, పొన్నపువ్వుల తెజేశ్వర్ రావు,సాలిన గాంధీ, నర్తు వరప్రసాద్, నీలాపు జగదీష్,పిలక సంతోష్, సాడి జయరాం,కారింగి మోహనరావు, ప్రకాష్ రావు పట్నాయక్, దుద్ది సతీష్,ఆశి కృష్ణారెడ్డి, ఆశి పురుషోత్తం, దువ్వు కృష్ణారెడ్డి, దుద్ది ధర్మారావు, మద్దిలి ఈశ్వర్రావు, బదకల మోహనదాసు, నీలాపు సారధి,మురపాల లచ్చయ్య, పిలక యాదవరెడ్డి, దుంగు రామయ్య రెడ్డి, బాకి లక్ష్మీనారాయణ, పిట్ట ఆనంద్, ఆశి దాలయ్య రెడ్డి, నైన తేజ, ఎన్ని అశోక్, ప్రవీణ్, కొయ్య గోపాల్, ఆశి శ్రీను, ఉప్పాడ నీల, దుక్క దీపక్ రెడ్డి, శాంతారావు, సప్ప శ్రీను,బోరుపద్ర పాపయ్య, ఫరూక్ పాల్గొన్నారు. ఇచ్ఛాపురం లో వివిధ రంగాలకు చెందిన పౌరులు సంఘీభావం తెలియజేసారు.

## దీక్షలో కూర్చున్న వారు

కవిటి వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య,దాస షణ్ముఖరావు, పొట్టి రామయ్య, జోగి సూర్యనారాయణ, గండుపిల్లి తిరుపతి, కరగాన వల్లభరావు,యలమంచి నీలయ్య, ఖాజురు ఎం శంకర్,ఎన్ బాబురావు, పిరియా కృష్ణారావు, నాగేష్, బి భాస్కర్, శాంతమూర్తి తదితరులు దీక్షలో కూర్చున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546

రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com
ప్రకాశం
జిల్లా వార్తలు



08-08-2026 ప్రకాశం సంపుటి: 3 సంచిక: 749 పేజీలు: 2 వెల : రూ.2



# కంటికి ఇంపు..

- ప్రజారోగ్యంతో చెలగాటం
- సువాసనలతో ఆకట్టుకుంటున్న స్టాల్స్
- ఆహార పదార్థాల్లో రసాయనాల వినియోగం
- వంటల్లో వాడే పదార్థాలు కల్తీవే
- రోగాల బారిన పడుతున్న వినియోగదారులు
- తనిఖీలు చేయని ఆరోగ్య అధికారులు

# ఆరోగ్యానికి ముప్పు

ఉలవపాడు, ఆగస్టు 7 (జాతీయవార్త): బస్టాండ్లలో, రోడ్లు పక్కన, తోపుడుబండ్లు, చిన్న చిన్న గుడారాల్లో చైనీస్ ఫుడ్స్... గోబి మంజూరి... పానీపూరి... కట్లెట్.. ఎగ్రైడ్ రైస్.. గోబిరైస్ వంటి బోర్డులు కనిపిస్తూ సువాసనలతో గుమగుమలాడుతుంటాయి. అటుగా వెలుతున్న పాదచారులు, వాహనదారులకు అక్కడే ఆగి ఆరగించాలనిపిస్తుంటాయి. వాటిలో విషపూరితమైన రసాయనాలు, రంగులు వాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని కొల్లగొడుతున్నారన్న విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. మోసాల్లో ఎన్నో రకాల వస్తువుల రూపంలో కొన్ని మోసాలు జరుగుతుంటే, మరికొన్ని మాయమాటలతో మోసాలు జరుగుతుంటాయి. ధనర్జనే ధ్యేయంగా పెట్టుకొన్న కొందరు వ్యాపారులు నిత్యం మనం వినియోగించే తినుబండరాలను సైతం కల్తీ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఇవేమి తెలియని వినియోగదారులు రుచిమాటున 'కల్తీ పదార్థాలను తిని ఆనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవల నూతనంగా రోడ్లు, బస్టాండుల్లో వెలుస్తున్న హోటళ్ళు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు ఒక్కటేమిటి ఆకలిగొన్న జనాన్ని ఊరించేలా మార్కెట్లోకి వస్తున్నాయి.



అయితే వీటిలో కొన్ని సంస్థలు ప్రజాసేవ మాటేమిటో గాని తినుబండరాలను రుచి, శుచి, నువాసన కోసం



తినుబండారాలను సైతం కల్తీ చేసి ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయి. వీటిలో సూపర్ మార్కెట్ల వద్ద నుంచి మాంస విక్రయ హోటళ్ళు వరకు అన్నింటిలో విషపూరిత రసాయనాలు వినియోగిస్తున్నట్లు ఇటీవల వీటిపై ఆధ్యయనం చేసిన పలు సంస్థలు గుట్టు విప్పాయి. ముఖ్యంగా సూపర్ మార్కెట్లతో పాటు బేకరి, ఫాస్టుఫుడ్లలో అధికంగా వీటిని ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు తినుబండారాలను పాడవకుండా వీటిలో మిథైల్, పారాజెన, ప్రొఫిల్, బుటిల్, ఇథైల్ పారబెల్ వంటి రసాయనాలను వినియోగిస్తున్నారు. రుచి, శుచి, వాసన కోసం వీటిని వినియోగిస్తుండగా, రుచి కోసం వీటిని తిన్నా బస్టాండులో రోడ్డుపై తయారు చేస్తున్న ఎగ్ రైస్ తమకు తెలియకుండానే వినియోగదారులు పాలపుతున్నారు. కొన్ని హోటళ్ళలో మిగిలిన ఫ్రిజ్లో ఉంచి మరుసటి రోజు అమ్మి ఇలాంటి ఆహార నిబద్ధతలు పాటించని అధికారులు కఠిన చర్యలు తీసుకొని కాపాడాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



**ప్రకాశం**



## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**గుడ్లూరు, ఆగస్టు 7 (జాతీయ వార్త):** ఉలవపాడు ప్రాజెక్టు పరిధి లోని గుడ్లూరు మండలంలోని చిన్న లాటరీపి సచివాలయంలోని అంగ న్వాడీ సెంటర్‌లో సిడిపిఓ మాధవి లత ఆదేశాలు మేరకు తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన గర్భవతులకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం, బిడ్డ కోరినప్పుడల్లా పగలు రాత్రి అని భేదం లేకుండా తల్లిపాలు పట్టిస్తూనే ఉండాలని, ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని అంగన్వాడీ అధికారులు సూచించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన అనుబంధం ఏర్పడుతుందని, గర్భాశయ క్యాన్సర్స్ బ్రెస్ట్ క్యాన్సర్స్ రాకుండా తల్లి ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పద్మ ఆదిలక్ష్మి ధనమ్మ సుబ్బమ్మ హాజరయ్యారు.

## శిశువుకు తల్లిపాలు అమృతం



**ఉలవపాడు, ఆగస్టు 7 (జాతీయ వార్త):** ప్రపంచ తల్లిపాల హారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని మన్నేటికోట పంచా యతిలో మన్నేటికోటలో గర్భిణీలు, బాలింతలకు అవగామన కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్ కే.రమాదేవి మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకమన్నారు. తల్లిపాలు శిశువుకి అమృతంతో సమానమని చెప్పారు. తల్లిపాలు ఇవ్వని తల్లలకు రొమ్ము కాన్సర్, గర్భసంచి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జె. పద్మ, తిరుమల, మాధవి, విజయ, మాధవీలత పాల్గొన్నారు.

## హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

**కందుకూరు, ఆగస్టు 7 (జాతీయవార్త):** ఉలవపాడు మండలం చాగొల్లు సర్విత కార్యాలయంగ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కందుకూరు సిఐ అన్వర్ బాషా వివరించారు. చాగొల్లు గ్రామానికి చెందిన ముద్దాయి అభిలాష్ పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన మెండా కత్తితో దారుణంగా హత్య చేశాడని తెలిపారు. అప్పటినుండి పరారీలో ఉన్న అభిలాష్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం చాగొల్లు సమీపంలో అభిలాష్ ఉన్న సమాచారం తెలుసుకొని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ముద్దాయిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారన్నారు.

## నారా భువనేశ్వరిని కలిసిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ దంపతులు

**కందుకూరు, ఆగస్టు 7 (జాతీయ వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ దంపతులు హైదరాబాదులో వారి నివాసమందు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి శ్రీకాంత్ దంపతులను ఆప్యాయంగా పలకరించి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.



### స్మశానం లేదు..

# మంచినీరు లేదు..!

**✻ దళిత, గిరిజన వాడల దుస్థితి మారేదెప్పుడు ✻ రాజ్యాంగం కల్పించిన హక్కులు కాగితాలకే పరిమితం**
**✻ కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్ ✻ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా**

**గుడ్లూరు, ఆగస్టు 7 (జాతీయ వార్త):** దళిత, గిరిజన వాడల్లో స్మశానం లేదు.. తాగునీరు లేదు.. రోడ్లు లేవు.. మురుగుకాలువలు లేవు.. వీధిలైట్లు లేవు.. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్ అన్నారు. కులవివక్ష లేని సమాజం కోసం నిర్వహిస్తున్న సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు మండలంలోని తొమ్మిది గ్రామాల్లో అధ్యయన బృందం పర్యటించి ఈ సమస్యలను గుర్తించింది. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుడ్లూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడుతూ.. ఒక మనిషి చనిపోయిన తర్వాత గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు స్మశాన స్థలం కూడా లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. దళిత, గిరిజన వాడల్లో స్మశాన స్థలాల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దళితుల స్మశాన సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా దాని అమలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్నారు. ఉత్తర్వులు ఫైళ్లకే పరిమితమై అధికారులు వాటిని అటకెక్కించడంతోనే నేటికీ దళిత, గిరిజన వాడల్లో స్మశాన సమస్యలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయని విమర్శించారు. తాగునీటి కోసం పేదలు నెలకు రూ.600 నుంచి రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని, ఇది ప్రజలపై పడుతున్న అదనపు ఆర్థిక భారమన్నారు. ప్రతి మనిషికి సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, నీటి కోసం కూడా డబ్బులు పెట్టి కొనుక్కునే పరిస్థితి రావడం పాలకుల వైఫల్యమన్నారు.దళిత, గిరిజన కుటుంబాలను పాత విద్యుత్ బకాయిల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం ఆపాలని రఘురాం డిమాండ్ చేశారు. పేదలపై ఉన్న పాత విద్యుత్ బకాయిలను తక్షణమే పూర్తిగా రద్దు చేయాలని



కోరారు. పాత బకాయిలను చూపించి విద్యుత్ సౌకర్యాన్ని నిలిపివేయడం లేదా సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరించడం సరికాదన్నారు.మండలంలోని దళిత, గిరిజన కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువలు, వీధిలైట్లు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. అపరిశుభ్రతతో కాలనీల్లో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దళిత, గిరిజన వాడల సమస్యలపై వివక్షతో వ్యవహరించకుండా సమాన దృష్టితో అభివృద్ధి చేయాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వాన్ని, ఆర్టికల్ 15 వివక్షను నిషేధిస్తుందని, ఆర్టికల్ 17 అంటరానితనాన్ని రద్దు చేసిందని, ఆర్టికల్ 21 గౌరవప్రదమైన జీవన హక్కును కల్పిస్తుందని రఘురాం గుర్తుచేశారు. అలాగే ఆర్టికల్ 46 ప్రకారం దళిత, గిరిజనుల సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో అమలైతేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు.గుడ్లూరు మండలంలో అనేక భూ సమస్యలు, అక్రమ ఆన్‌లైన్ నమోదులు జరుగుతున్నాయని ప్రజలు అధ్యయన బృందం దృష్టికి తీసుకువచ్చారని రఘురాం తెలిపారు. పేదల భూములకు సంబంధించిన




సమస్యలపై ప్రత్యేక విచారణ నిర్వహించి, అక్రమ ఆన్‌లైన్ నమోదులను గుర్తించి రద్దు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.అభివృద్ధి అంటే పెద్దల అభివృద్ధి కాదు.. పేదల జీవితాల్లో మార్పు రావడమే నిజమైన అభివృద్ధి" అని రఘురామ్ స్పష్టం చేశారు.దళిత, గిరిజన వాడలకు నీరు ఎందుకు రావడం లేదుసీఐటీయూ నాయకులు జి. వెంకటేశ్వర్లు గుడ్లూరు మండలంలోని దళిత, గిరిజన వాడల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, అధికారులు దళిత, గిరిజనుల అభివృద్ధి గురించి పదేపదే మాట్లాడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వారి జీవితాల్లో మార్పు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.మండలంలోని గ్రామాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న వాటిలో మరమ్మతులకు గురైన వాటిని వెంటనే బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన వాడలకు తాగునీరు అందకపోయినా, అగ్రకులాలు నివసించే ప్రాంతాలకు మాత్రం నీటి సరఫరా జరుగుతున్న పరిస్థితులు ఉన్నాయని, ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాకుండా కుల వివక్షకు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు.దళిత, గిరిజన వాడల్లో స్మశానాలు, మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, వీధిలైట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు భూ సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొట్టే వెంకయ్య, దామా కృష్ణయ్య, గుత్తి మల్లికార్జున, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి జాలయ్య, సుల్తాన్, నేలటూరి తిరుపాలు, సుంకర విజయలక్ష్మి, చిన్నమ్మ, రాజగోపాల్‌లి తిరుపాలు చలంచర్ల శ్రీరాములు రాపూరి రమేష్ ఆనందరావు సవలం చెన్నయ్య ద బాలకోటయ్య, దాసరి సీతారాం పొట్లూరి ప్రసాద్ ఎస్ డి సుభాని ప్రజానాట్యమండలి గాయకుడు పాలకుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్నా వద్దకు ఎమ్మార్వో బాలకృష్ణ పి బాలకిషోర్ విచ్చేసి దళిత కాలనీలను వెంటనే సందర్శిస్తామని స్మశానాల సమస్యలు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను ముగించారు.

## గుడ్లూరులో రైతన్న మీకోసం

**గుడ్లూరు, ఆగస్టు 7 (జాతీయ వార్త):** స్థానికగుడ్లూరు-1,2 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వారం రోజులు అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుమన్నారు. ఎల్నినో ప్రభావం వలన వర్షాలు పడే పరిస్థితి లేనందున వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలన్నారు. ఇప్పటికే వరి పంట సాగు చేసినవారు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు అలీ, సుధారాణి , రోషిని, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.





## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

**లింగసముద్రం, ఆగస్టు 7 (జాతీయ వార్త):** ఎల్ నినో ప్రభావం - నివారణ కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా శుక్రవారం వి.ఆర్ కోట గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ఆదినారాయణ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన సాధారణ వర్షపాతం నమోదవడం లేదా దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితులు వంటి ప్రతికూల ప్రభావాలు ఉండవచ్చున్నారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వర్షాభావ పరిస్థితులను దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి .శ్రీనాథ్ , గ్రామ వ్యవసాయ సహాయకులు ఏం.వినయ్ , గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546